సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 2 డిసెంబర్ । 2024

వైభవంగా పడిపూజ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పీటీఎస్‌లో అయ్యప్ప పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ కాఫీ హౌస్(ఐసీహెచ్) ఆధ్వర్యంలో అర్చకులు వామనశర్మ పడిపూజ నిర్వహించారు. ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏజీఎం హెచ్ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఐసీహెచ్ సిబ్బంది, అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

ఆదివరాహస్వామికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కమాన్‌పూర్(మంథని): ప్రసిద్ధ శ్రీఆదివరాహ స్వామిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో స్వామివారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

ఓదెల మల్లన్నకు మొక్కులు



పట్నాలు వేస్తున్న పూజారులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వృత్తిని దైవంగా భావించాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న నరహరి

పాలకుర్తి(రామగుండం): వృత్తిని అందరూ దైవంగా భావించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి సూచించారు. ఆలయ ఫౌండేషన్, ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం ఆయన సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుందన్నారు. యువతీ యువకుల కోసం త్వరలోనే ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఫౌండేషన్ ఇన్‌చార్జి పరికిపండ్ల రాము, సభ్యులు పుప్పాల దయానందం పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధికి కృషి



నాయకులను సన్మానిస్తున్న ఓదెలు యాదవ్

జ్యోతినగర్(రామగుండం): యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంపుల ఓదెలు యాదవ్ అన్నారు. జనగామ, ఎన్టీపీసీ పట్టణ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్టీపీసీలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన కార్యవర్గం జిల్లాలో యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం జనగామ యాదవ సంఘం అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య యాదవ్, గుర్రాల మల్లేశ్ యాదవ్ తదితరులకు శాలువాలు కప్పి సన్మానించారు. గుండెబోయిన వెంకన్న యాదవ్, వేముల కొమురయ్య యాదవ్, చెలుకల రాంమూర్తి, ఎర్ర మల్లయ్య యాదవ్, లింగయ్య యాదవ్, బండి కొమురయ్య, చేపూరి కొమురయ్య ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

- పనుల్లో వేగం పెంచుతాం
- ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు భేష్
- 4న పెద్దపల్లిలో లక్ష మందితో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ
- రాష్ట్రమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- నీటిపారుదల ప్రాజెక్టులు, పౌర సరఫరాల శాఖపై సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, హాజరైన ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మొక్క ఇచ్చి ఆహ్వానం పలుకుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లాల అధికారులు



సమీక్షకు హాజరైన వివిధ జిల్లాల అధికారులు

సాక్షి, పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రతీఎకరాకు సాగునీరు అందేలా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్షించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. తొలుత ధాన్యం కొనుగోళ్లపై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రులు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సీఎం బహిరంగసభ వేదికను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. సీఎం సభ నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోళ్లు, సన్నరకం వడ్లకు బోనస్ చెల్లింపు తదితర అంశాలపై సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.

తక్కువ ఖర్చు.. అధిక ఆయకట్టుకే ప్రాధాన్యం

గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ పనులు, కాళేశ్వరం ప్యాకేజీ– 9 పెండింగ్, చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల, ఎల్లంపల్లి కాలువ నెట్‌వర్క్ ప్యాకేజీ– 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాలపై మంత్రి ఉత్తమ్ అధికారులకు పలు సూచనలు చేశారు. తక్కువ ఖర్చుతో రైతులకు సాగునీరు అందించే పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని ఆదేశించారు. రోళ్లవాగుపై నివేదిక అందించాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు వెంటనే నిధులు విడుదల చేస్తామని తెలిపారు. కాలువ పనులు త్వరగా చేపట్టేలా రైతులతో మాట్లాడి కోర్టు కేసు విత్‌డ్రా చేయించాలని ప్రజాప్రతినిధులను కోరారు. పత్తిపాక రిజర్వాయర్‌ను రూ.2,950 కోట్ల అంచనా వ్యయంతో 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు, కాలువ ఆపరేషన్, నిర్వహణకు నిధులు కేటాయించలేదని మంత్రి ఆరోపించారు. తాము అవసరమైన చోట పనులు పూర్తిచేస్తామని అన్నారు. రామగుండం ఎత్తిపోతల 95 శాతం పూర్తయిందని, ఈనెలాఖరు వరకు పెండింగ్ పనులు పూర్తిచేసి వచ్చే సీజన్ నుంచి పంటలకు సాగునీరు అందించాలని మంత్రి సూచించారు. పాలకుర్తి ఎత్తిపోతల ప్రతిపాదనలు, నీటి కేటాయింపుల ప్రక్రియ పూర్తికావాలని అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్యాకేజీ– 9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తిచేయాలని మంత్రి సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు భేష్..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సన్నరకం ధాన్యం అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడా రూ.2,800 కన్నా తక్కువ ధరతో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలని ఆదేశించారు.

విస్తృతంగా ప్రచారం చేయాలి..

రూ.2 లక్షల రుణమాఫీ, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్‌తో లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలని సూచించారు. పోతారం, భీంఘనపూర్ ఎత్తిపోతల పనుల ప్రతిపాదనలు అందించాలన్నారు. చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని, దీని భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని సూచించారు. దేవాదుల ప్రాజెక్టుకు మరిన్ని అవుట్‌లెట్ నిర్మాణాలు చేయాలని అన్నారు.

మిల్లర్లు సహకరిస్తున్నారు..

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సాఫీగా, సంతృప్తికరంగా సాగుతున్నాయని, రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ పాలసీ అనుసరిస్తూ సహకారం అందిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గౌరవెల్లి, గండేపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు బండ్ నిర్మాణం చివరిదశలో ఉందని, కాలువల పనులకు భూసేకరణ పూర్తిచేయాలని సూచించారు. కాళేశ్వరం ప్యాకేజీ– 9 పనులు, మలక్‌పేట రిజర్వాయర్ కాలువ, అప్పర్ మానేరు పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు కోయ శ్రీహర్ష, పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝా, సత్యప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్లు వేణు, అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన ఉద్యమ కెరటం

- ముగిసిన మూడు దశాబ్దాల పోరు
- ములుగు ఎన్‌కౌంటర్‌లో ఏగోళపు మల్లయ్య మృతి





ఏగోళపు మల్లయ్య సోదరులు రాజయ్య, లక్ష్మయ్య, శ్రీను, మల్లయ్య మృతిపై గ్రామస్తుల చర్చలు

పాలకుర్తి(రామగుండం): పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరు సాగించిన మావోయిస్టు నేత ఏగోళపు మల్లయ్య ఉరఫ్ మధు ఉరఫ్ కోటి(47) మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందగా అందులో కోటి ఉన్నారు. మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు. మల్లయ్య దండకారణ్యం డివిజనల్ కమిటీ సభ్యుడిగా, ఏటూరునాగారం– మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

30ఏళ్లుగా ఉద్యమంలోనే..

మంథని నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోళపు గట్టయ్య–వెంకమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. వీరిలో మల్లయ్య నాలుగోవాడు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుకున్న మల్లయ్య.. చిన్నతనంలో పశువులు కాస్తూనే వ్యవసాయం చేసేవాడు. 1990లో పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన తన 17ఏళ్ల వయసులోనే అడవిబాట పట్టారు. అప్పటికే గ్రామానికి చెందిన మావోయిస్టు నేత బయ్యపు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. పదుల సంఖ్యలో మావోయిస్టు(అప్పటి పీపుల్స్‌వార్)లు పార్టీలో పనిచేస్తున్నారు. అదేసమయంలో పెద్దపల్లిలో పనిచేస్తున్న ఓ పోలీస్ అధికారిపై జరిగిన దాడితో ఆగ్రహించిన పోలీసులు.. రాణాపూర్‌పై మెరుపుదాడి చేశారు. గ్రామస్తులను విచక్షణరహితంగా కొట్టారు. స్థానిక పరిస్థితులను గమనించిన మల్లయ్య ఇల్లు వదిలి ఎటో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు మల్లయ్య గురించి గ్రామస్తులకు, కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం లేదు.

తల్లిదండ్రుల చివరి చూపునకూ నోచుకోలే..

మల్లయ్య తన తల్లిదండ్రుల చివరిచూపునకూ నోచుకోలేదని సోదరులు రాజయ్య, లక్ష్మయ్య, శ్రీను కన్నీటి పర్యంతమయ్యారు. మల్లయ్య తండ్రి గట్టయ్య పదేళ్ల క్రితం, తల్లి వెంకమ్మ ఏడాదిన్నర క్రితం మృతిచెందారు. ఆసమయంలో కూడా మల్లయ్య రాలేదని సోదరులు తెలిపారు. మల్లయ్య ఎన్‌కౌంటర్లో మృతిచెందాడనే వార్త ఆదివారం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో బంధువులు, మిత్రులు రాణాపూర్ చేరుకున్నారు. ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో తమ తమ్ముడి మృతదేహం ఉందని పోలీసులు సమాచారం అందించారని, సోమవారం అక్కడకు వెళ్తామని మల్లయ్య సోదరులు తెలిపారు.

కలిసి కల్లు అమ్మినం..

గౌడ కులానికి చెందిన మల్లయ్య చిన్నతనంలో కల్లు అమ్మేవాడని స్నేహితులు తెలిపారు. 1990లో స్థానికంగా తెల్లకల్లుకు అంతగా గిరాకీ లేక మల్లయ్య, తాను కలిసి క్యాన్‌లలో కల్లు నింపుకుని గోదావరిఖని వెళ్లి అమ్ముకుని వచ్చే వాళ్లమని బాల్యమిత్రుడు, మాజీ ఉప సర్పంచ్ బాలగోని కుమార్‌గౌడ్ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

భూగర్భ గనుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు

> ఓసీపీలు, భూగర్భ గనుల్లో ఓవర్ బర్డెన్, బొగ్గు పొరలు వెలికి తీసేందుకు పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం తొలుత రంధ్రం చేసి పేలుడు స్వభావం కలిగిన పదార్థాలను అందులో నింపుతారు. ఆ తర్వాత ఎలక్ట్రిక్ డిటోనేటర్లు అమర్చుతారు. ఇలాంటి వాటికి వాటిని నావెల్ ద్వారా అనుసంధం చేస్తారు. విద్యుత్ శక్తిని వినియోగించి వాటిని పేల్చుతారు. ఇది ఇప్పటివరకు సింగరేణిలో పేలుడుకు వినియోగించే పద్ధతి. అయితే, కేంద్రప్రభుత్వం తాజా ఆదేశాలతో ఉపరితల గనుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. ఓసీపీల్లో ఈ విధానం సక్సెస్ కావడంతో భూగర్భ గనుల్లోనూ వినియోగించేందుకు యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది.

- డీఎంఎస్ అనుమతి రాగానే వినియోగం
- తొలుత ఓసీపీల్లో ప్రయోగాత్మకంగా అమలు
- అసాంఘిక శక్తుల కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు
- బొగ్గు గనుల్లో ఆధునిక సాంకేతికత అమలు చేయాలని ఆదేశాలు



ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను పేల్చే యంత్రం

గోదావరిఖని: ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలు, అసాంఘిక శక్తుల చేతుల్లోకి పేలుడు పదార్థాలు చేరకుండా కేంద్రప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ, ప్రైవేట్ గనుల్లో ఇకనుంచి ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను వినియోగించాలని హోంమంత్రిత్వ ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో సింగరేణి యాజమాన్యం ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఓసీపీల్లో పదిరోజులుగా ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు వినియోగిస్తోంది.

ఏటా 18వేల డిటోనేటర్ల వినియోగం..

సింగరేణిలోని ఓసీపీల్లో మట్టి, బొగ్గు, భూగర్భ గనుల్లో బొగ్గు పొరలను వేరు చేసేందుకు యాజమాన్యం ఏటా సుమారు 18వేల డిటోనేటర్లను వినియోగిస్తోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలతో ఓసీపీల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను వినియోగిస్తూ వచ్చింది. ఇకనుంచి భూగర్భ గనుల్లోనూ వినియోగించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకుంటోంది. ఇందుకోసం పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న సంస్థలతో ఇటీవల భేటీ అయ్యింది. ఆ సంస్థల సూచనల మేరకు ఇకనుంచి ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను వినియోగించాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

21 ఓసీపీలు.. 19 భూగర్భ గనులు

సింగరేణిలోని 21 ఓసీపీల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను వినియోగించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఓసీపీల్లో రోజూ 700 టన్నులు, 19 భూగర్భగనుల్లో 200టన్నుల పేలుడు పదార్థాలను వినియోగిస్తోంది. వీటిని పేల్చేందుకు ప్రతీరోజు 70 డిటోనేటర్లు వాడుతోంది. గతంలో ఎలక్ట్రికల్ డిటోనేటర్లు వినియోగిస్తే తీవ్రవాదులు, ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లేవని, వారు విద్యుత్ శక్తిని వినియోగించి పేల్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించి.. కేవలం ఎలక్ట్రానిక్ డిటోనేటర్లనే వినియోగించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీచేసింది.

ఇంకా రాని అనుమతి

సింగరేణి భూగర్భ గనుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు వినియోగించేందుకు ఇంకా డీఎంఎస్ నుంచి అనుమతి రాలేదని అధికారులు అంటున్నారు. ప్రస్తుతానికి ఓసీపీల్లో ఈవిధానాన్ని కొనసాగిస్తున్నారు. డీఎంఎస్ అనుమతి రాగానే భూగర్భ గనుల్లో కూడా ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు వినియోగించాలని చూస్తున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 19భూగర్భగనుల అనుమతి కోసం యాజమాన్యం వేచి చూస్తోంది.

నర్సింగ్ కళాశాల ప్రారంభానికి సిద్ధం

- నేడు వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో నర్సింగ్ కాలేజీతోపాటు పారా మెడికల్ కోర్సులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీలో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలేజీలో 58 మందికి ప్రవేశాలు..

ప్రభుత్వ మహిళా నర్సింగ్ కాలేజీకి 60 సీట్లు కేటాయించగా, 58 మంది ప్రవేశం పొందారు. కాలేజీ నిర్వహణకు పక్కా భవనం లేదు. హాస్టల్, క్లాసులు ఒకేచోట నిర్వహించడానికి తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం శారదనగర్‌లోని సింగరేణి భవనంలో నర్సింగ్ కాలేజీ నిర్వహణ కోసం అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.



సిమ్స్‌లోని నర్సింగ్ కళాశాలలో ఏర్పాట్లు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పెద్దపల్లిరూరల్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుదామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. జిల్లా సివిల్ జూనియర్ జడ్జి మంజుల తదితరులు హాజరయ్యారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉచితంగా ఏఆర్‌టీ మందులు వాడుతూ సాధారణ జీవితం గడిపే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో తెలిపారు. అనంతరం కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి. ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, రాజమౌళి, వాణిశ్రీ, ఆర్‌ఎంవో రవీందర్‌తోపాటు వెంకటేశ్వర్లు, కావేటి రాజ్‌గోపాల్, ఐసీటీసీ కౌన్సెలర్ శంకర్ తదితరులున్నారు.



అవగాహన ర్యాలీలో ప్రతినిధులు

సదాశయ ఫౌండేషన్‌కు అవార్డు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సదాశయ ఫౌండేషన్ సంస్థ ఆదివారం అవార్డు అందుకుంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి రాజకనకయ్య ఈ పురస్కారం అందుకున్నారు. రాష్ట్రంలోని వివిధ సంస్థలు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డులు అందజేశారు. సదాశయ ఫౌండేషన్ నేత్ర, శరీర, అవయవదానాలపై చేస్తున్న కృషిని గుర్తించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) బంజారాహిల్స్, హైదరాబాద్ ఈ అవార్డుకు ఎంపికచేసింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి రాజకనకయ్యకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న రాజకనకయ్య

రైల్వేలో ‘గుర్తింపు’ పోరు

- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- ఫ్లెక్సీలు, బ్యానర్లతో నిండిన రైల్వేస్టేషన్
- ఈనెల 4, 5వ తేదీల్లో పోలింగ్
- నేటితో ప్రచారం ముగింపు

ఓటర్ల వివరాలు

కరీంనగర్	300	మంచిర్యాల	275
పెద్దపల్లి	300	రామగుండం	750

రామగుండం: దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగుల గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రధాన రైల్వే స్టేషన్లలోని బ్రాంచి ప్రతినిధులు తమ పరిధిలో నికేంద్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈనెల 4, 5వ తేదీల్లో జరిగే ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కార్మికులు, ఉద్యోగులకు విన్నవిస్తున్నారు. ఎన్నికల్లో 30 శాతం ఓట్లు సాధించిన కార్మిక సంఘాలను క్రమసంఖ్య ఆధారంగా గుర్తింపు సంఘాలుగా గుర్తించి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎన్నికల ప్రచారం సోమవారం ముగియనుంది.

పోటీపడుతున్న యూనియన్లు..



దక్షిణ మధ్య ఎంప్లాయిస్ సంఘ్

- దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ (డీఎంఆర్‌కేఎస్)
- ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఐఆర్‌ఎంయూ)
- రేల్ మజ్దూర్ యూనియన్(ఆర్‌ఎంయూ)
- సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్(ఎస్‌సీఆర్‌ఈఎస్)
- సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ)



దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్

రామగుండం పరిధిలోని ఓటర్లు..

రామగుండం బ్రాంచి పరిధిలో కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, రామగుండం రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ మధ్య పోటీ నెలకొనే అవకాశం ఉంది.

వివిధ సంఘాల మేనిఫెస్టోలోని ప్రధానాంశాలు

- ఉద్యోగులందరికీ రిస్క్–హార్డ్ డ్యూటీ అలవెన్స్
- టాక్ మెయింటెయినర్లకు రిస్క్ అలవెన్స్ పెంపు
- ట్రాక్ మెయింటెయినర్లకు ఆరు గంటల పని విధానం
- ఉద్యోగులందరికీ ద్విచక్ర వాహన భత్యం కల్పించడం
- ఉద్యోగుల పిల్లలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యాభత్యం చెల్లింపు
- అన్నిరకాల క్వార్టర్లలో ఏసీ బిగించేందుకు ఏర్పాట్లు
- ఉద్యోగుల తల్లిదండ్రులకు రైల్వే పాస్, వైద్య సదుపాయం కల్పించడం
- 70 శాతం రన్నింగ్ అలవెన్సు ఆదాయపుపన్ను నుంచి మినహాయింపు
- పీఎల్‌బీ బోనస్ సీలింగ్ ఎత్తివేసి అసలు జీతంపై బోనస్ చెల్లింపు
- అన్ని కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీలను సత్వరమే భర్తీ చేయించడం.

క్లుప్తంగా

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి



మృతుడు శ్రీనివాస్

సారంగాపూర్(జగిత్యాల): లచ్చునాయక్‌తండా గ్రామానికి చెందిన గూగులోతు శ్రీనివాస్(32) అనే ట్రాక్టర్ డ్రైవర్ ఆదివారం ట్రాక్టర్‌పై నుంచి కింద పడి మృతిచెందాడు. ఎస్సై దత్తాద్రి వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన చిగిరి రాజన్న అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో రైతుల వరి కోసిన వడ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసి తీసుకెళ్తున్న క్రమంలో డ్రైవర్ శ్రీనివాస్ ట్రాక్టర్ నడుపుతూనే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మధ్యలో కింద పడిపోయాడు. శ్రీనివాస్ చాతిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహం పోస్టుమార్టం తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడున్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్స్



కృష్ణారెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం: ఆన్‌లైన్ గేమ్స్ బారిన పడిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న కూసుకుంట్ల కృష్ణారెడ్డి(31) అనే యువకుడు ఒక ప్రైవేట్ కొరియర్‌లో జాబ్ చేస్తున్నాడు. తన తల్లిదండ్రులు గతంలోనే చనిపోగా.. తన సోదరి ఇంట్లో ఉంటూ జాబ్ చేస్తున్నాడు. చాలా రోజుల నుంచి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ బానిసై నష్టపోయాడు. పెళ్లి కావడం లేదని బాధపడుతూ మానసికంగా సరిగా లేని కృష్ణారెడ్డి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి సోదరి సౌమ్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం



కార్యవర్గ సభ్యులు

తిమ్మాపూర్(మానకొండూర్): తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు సయ్యద్ అసద్ విరమణ చేయడంతో నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటరాజిరెడ్డి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఇటిక్యాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నెర్నాల గంగయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఉయ్యాల రవిని ప్రకటించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసిన వ్యక్తి అసద్ అని కొనియాడారు. ఉద్యోగుల సమస్యలు ఒక్కరోజులో ముగిసిపోయేవి కాదన్నారు. కార్యవర్గానికి పలు ఉద్యోగ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటరత్నం, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, పోలు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎల్ సూపర్ ఫిఫ్టీలో శిక్షణ



కుసుమ రామయ్య పాఠశాలలో శిక్షణ ఇస్తున్న టెక్నీషియన్లు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్ ఫిఫ్టీలో భాగంగా ఆదివారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు సృజనాత్మకతో కూడిన నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. సర్క్యూట్ కనెక్షన్లు, కోడింగ్‌లు ఎలా చేయాలో అర్థమయ్యేలా నేర్పారు. ఏటీఎల్ ఇన్‌చార్జి పాకాల శంకర్‌గౌడ్, టెక్నీషియన్లు జక్కని సుధాకర్, ఆడెపు నవీన్, ఎనగందుల రమేశ్, తుమ్మ శ్రీకాంత్, వీరభత్తిని సాగర్, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని.. విజయం సాధించి

- పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపిక
- విధుల్లో చేరిన యువత
- ఒకేసారి కొలువులో చేరిన 392 మంది



పోలీసు అధికారులతో పోలీసు కానిస్టేబుళ్ల గ్రూప్ ఫొటో



నియామకపత్రం అందిస్తున్న సీపీ శ్రీనివాస్



విధుల్లో చేరుతున్న పోలీసు కానిస్టేబుళ్లు

గోదావరిఖని: కొందరివి వ్యవసాయ కుటుంబాలు.. మరికొందరు ఉన్నత విద్యావంతులు.. ఇంకొందరు ఎన్‌సీసీ కేడెట్లు.. ఇప్పటికే వివిధ ఉద్యోగాలు చేస్తున్నవారు మరికొందరు.. వీళ్ల ఖాకీ కొలువు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.. ఇందుకోసం లక్ష్యం నిర్దేశించుకున్నారు.. రాత్రింబవళ్లు శ్రమించారు.. కొలువు కొట్టారు. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఇందులోని 392 మంది రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం విధుల్లో చేరారు. ఉద్యోగంలో చేరిన సందర్భంగా కొందరిని పలుకరించగా.. తమ అభిప్రాయాలు ఇలా వెల్లడించారు.

ఒక్క మార్కుతో మిస్సయినా..



మాది వ్యవసాయ కుటుంబం. బీటెక్ ట్రిపుల్ఈ పూర్తిచేశా. రైల్వేశాఖలో గ్రూప్ – డి ఉద్యోగం వచ్చింది. అయినా పోలీసు శాఖలో చేరాలనేది నా లక్ష్యం. 2018లో ఒక్క మార్కుతో కానిస్టేబుల్ ఉద్యోగం మిస్ అయ్యా. ఇప్పుడు ఉద్యోగం వచ్చింది. ఎస్సై కావాలనేది నా లక్ష్యం. ప్రస్తుతం సుల్తానాబాద్ ఠాణాకు కేటాయించారు. సీఎం బందోబస్తు డ్యూటీ వేశారు.

– కాటు హరీశ్‌గౌడ్, మారేడిగొండ, పెద్దపల్లి

కల నెరవేరింది



ఖాకీ డ్రెస్‌వేయాలనే నా కల నెరవేరింది. బీటెక్ సివిల్ పూర్తి చేశా. ఆర్‌ఆర్‌బీలో గ్రూప్ –డి వచ్చింది. సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా రెండేళ్లపాటు కోల్‌కత్తా ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేశా. పట్టుదలతో మూడు ఉద్యోగాలు సాధించిన. కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఎస్సై కావాలనేది లక్ష్యం. – మోతె విజయ్, ఖిలావనపర్తి, ధర్మారం

రెండోసారికి సక్సెస్



మొదటి ప్రయత్నంలో విఫలమైనా పట్టుబట్టి రెండోసారి ప్రయత్నం చేశా. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ప్రిలిమ్స్, ఈవెంట్స్, మెయిన్స్ కోసం చాలా కష్టపడ్డా. సుమారు రెండేళ్లపాటు ఈ ఉద్యోగం కోసం కసరత్తు చేశా. భవిష్యత్‌లో గ్రూప్–2 సాధించాలని ఉంది.

– కత్తర్ల నాగరాజు, కుక్కలగూడూర్, పాలకుర్తి

కష్టానికి ఫలితం



బీటెక్ ట్రిపుల్ఈ చదివా. హార్టికల్చర్ డిప్లొమా కూడా పూర్తిచేశా. ఎస్సై కొలువు కోసం ప్రత్నించా. వచ్చినట్లే వచ్చి పోయింది. నిరాశ చెందలే. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి శ్రమించా. పోలీసు ఉద్యోగం సాధించా. గోదావరిఖని వన్‌టౌన్‌లో రిపోర్టింగ్ చేశా.

– ముత్యాల ప్రవల్లిక, రమేశ్‌నగర్, గోదావరిఖని

ఎన్‌సీసీ కేడెట్‌ని..



డిగ్రీ పూర్తి చేసిన. కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశా. ఎన్‌సీసీలో చేరినప్పటి నుంచే ఖాకీ డ్రెస్ వేసుకోవాలనే పట్టుదల పెరిగింది. అగ్రికల్చర్ డిప్లొమా కూడా పూర్తిచేశా. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలనే పట్టుదలతో ఉన్నా. రెండేళ్లు శ్రమించి ఉత్తీర్ణత సాధించా.

– కె.అఖిల, పెద్దపల్లి

హోంగార్డు నుంచి ..



సుమారు పన్నెండేళ్లపాటు హోంగార్డుగా పనిచేశా. డ్యూటీ చేస్తూనే ప్రిలిమ్స్‌కు ప్రిపేర్ అయ్యా. ఆ తర్వాత ఈవెంట్స్ కోసం ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశా. మెయిన్స్ కోసం సెలవు తీసుకుని హైదరాబాద్‌లో ప్రిపేర్‌అయి కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించా. పోలీసుశాఖలోనే ఉన్నత ఉద్యోగం సాధించాలని ఉంది.

– మిట్టపల్లి రేణుక, పెద్దబొంకూరు, పెద్దపల్లి

పట్టుదల.. లక్ష్యం.. క్రమశిక్షణ

- ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా
- కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



కరాటే పోటీల్లో విద్యార్థినులు

జ్యోతినగర్(రామగుండం): పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించారు. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో ఉంటే నిర్దేశిత లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని అంటున్నారు పలువురు విద్యార్థులు. కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో ఇటీవల రెండ్రోజులపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. అండర్–17లో బాలుర, బాలికలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు పోటీల్లో పాలుపంచుకుని ప్రతిభ చూపారు. 50 మంది కోచ్‌లు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక చేశారు. వారు చూపిన ప్రతిభ, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడంపై కొందరు విద్యార్థులను ప్రశ్నించగా.. తమ మనోభావాలు ఇలా వెల్లడించారు.

సత్తా చాటుతా



అండర్–17 బాలికల కేటగిరీలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ఆనందంగా ఉంది. కోచ్‌ల శిక్షణతో జాతీయ స్థాయిలో సత్తా చాటి రాష్ట్రానికి పతకం తీసుకొస్తా.

– రూపాశ్రీ, నిజామాబాద్

ఆనందంగా ఉంది



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉంది. నిర్వాహకులు చాలా బాగా ఏర్పాట్లు చేశారు. పోటీల్లో పాల్గొనడమే కాదు.. ప్రతిభ కూడా చూపా. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొనాలని ఉంది. అక్కడ ప్రతిభ చూపి ప్రత్యేక గుర్తింపు పొందాలని శిక్షణ కూడా పొందుతున్నాను.

– సాయి నమిత, రంగారెడ్డి

సంతోషంగా ఉంది



అండర్–17లో పాల్గొని 54 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చూపిన. జాతీయ స్థాయి పోటీలను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది. అక్కడ కూడా ప్రతిభ చూపుత. ఎక్కడ కరాటే పోటీలు జరిగినా అక్కడ పాల్గొనాలని ఉంది. ప్రతిభ చూపితే అందరికీ మంచిపేరు వస్తుందనేది నా అభిప్రాయం.

– హర్షవర్ధన్, వరంగల్

కరాటే అంటే ఇష్టం



కరాటే అంటే నాకెంతో ఇష్టం. స్కూల్‌లోనే శిక్షణ పొందుతున్న. ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నరు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది.

– సనిత్, ఆదిలాబాద్

బాలికలకు శిక్షణ అవసరం



బాలికలు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ పొందడం చాలా అవసరం. వారంలో రెండురోజులు కరాటేలో శిక్షణ పొందాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

– రమేశ్, ఏసీపీ, గోదావరిఖని

సర్టిఫికెట్‌తో ఉపయోగం



ప్రభుత్వం కరాటేను ఎస్జీఎఫ్‌లో క్రీడగా గుర్తించింది. పోటీల్లో ప్రతిభ చూపేవారికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా ఉంటుంది. కరాటేతో ఆరోగ్యంగానూ ఉంటారు.

– శ్రీనివాస్, కార్యదర్శి, ఎస్‌జీఎఫ్

ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

- బాలికల విజేత కరీంనగర్
- బాలుర విజేత ఆదిలాబాద్



కప్ సాధించిన క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన 68వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల హాకీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో కరీంనగర్, బాలు విభాగంలో ఆదిలాబాద్ జట్లు విజేతలుగా నిలిచాయి. నిజామాబాద్ బాల, బాలికల జట్లు రన్నరప్ సాధించాయి. 3,4వ స్థానాల్లో బాలుర విభాగంలో రంగారెడ్డి, హైదరాబాద్ జట్లు, బాలికల విభాగంలో రంగారెడ్డి, నల్గొండ జట్లు నిలిచాయి. హుజూరాబాద్ పట్టణానికి చెందిన అవిఘ్న, సహస్ర, మైటీ, మిధున, పర్ణిత, సాయినాథ్, దుర్గరాజు మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాలంటే తనకు ప్రాణం అన్నారు. క్రీడాకారులను చూస్తుంటే చిన్నప్పుడు క్రికెట్ ఆడుతున్న రోజులు గుర్తుకొస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో మినీ స్టేడియం నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, ప్రతాప మంజుల కృష్ణ పాల్గొన్నారు.

డ్రైవర్‌గా విధులు.. రాత్రి చోరీలు

- యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం
- ఇద్దరి అరెస్టు

జ్యోతినగర్(రామగుండం): పొద్దంతా లారీలను నడుపుతూ రాత్రి కాగానే ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రోడ్ల వద్ద ఉన్న ఏటీఎంల్లో చోరీలకు ప్రయతిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లను ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి టీటీఎస్ ఎదురుగా ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో గత నెల 26న చోరీకి గుర్తుతెలియని వ్యక్తులు విఫలయత్నం చేసిన విషయంపై బ్యాంక్ మేనేజర్ రణధీర్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన తుమ్మల మధు, బండ్ల అబ్రహంలను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి అరెస్టు చేయడంతోపాటు నేరం చేయడానికి ఉపయోగించిన లారీ, ఇనుప సుత్తి, జర్కిన్సు, మంకీ క్యాపులు, మాస్కులు, గ్లౌజులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. కానిస్టేబుళ్లు టి.అంజయ్య జె.శ్రీనును రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

ముద్ద అన్నం.. నీళ్ల చికెన్



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా చందుర్తి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం ముద్ద అన్నం, నీళ్ల చికెన్ వడ్డించారు. నాణ్యమైన భోజనం అందించడంలో హాస్టల్ నిర్వాహకులు పూర్తిగా విఫలమవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించేలా ఉన్నతాధికారులు చూడాలని విద్యార్థులు కోరారు.

– చందుర్తి

కారకులను కఠినంగా శిక్షించాలి



రాజీవ్‌రహదారిపై బైఠాయించిన దీప్తి కుటుంబసభ్యులు, బంధువులు

- దీప్తి కుటుంబ సభ్యులు, బంధువుల డిమాండ్
- రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన

జ్యోతినగర్(రామగుండం): ప్రేమించి, పెళ్లి చేసుకున్న దీప్తిని భర్తే చిత్రహింసలు పెట్టి చంపాడని మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. కట్నం కోసం తన భర్త పెడుతున్న వేధింపులు భరించలేక చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీసి శనివారం రాత్రి దేవరకొండ దీప్తి(26) ఆత్మహత్య చేసుకుంది. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని నివాసం ఉండే నరేందర్(32), గోదావరిఖనికి చెందిన దేవరకొండ దీప్తిని 2021న ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక బాబు జన్మించాడు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనిలోని ఓ అద్దె ఇంట్లో నరేందర్, దీప్తి నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో కట్నం కోసం వేధించడంతో దీప్తి ఆత్మహత్య చేసుకుంది. దీప్తి మృతికి కారకులైన నరేందర్‌తోపాటు మిగతా వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని దీప్తి కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం బైఠాయించారు. తన కూతురును నరేందర్ వేధింపాడని, అతడే చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నాడని ధ్వజమెత్తారు. తన కుమార్తె మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు నినాదాలు చేశారు. పోలీసుల జోక్యంతో ఆందోళనకారులు శాంతించారు.

ఇటుక ట్రాక్టర్ ఢీకొని గీత కార్మికుడి దుర్మరణం

- బాధిత కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన



కైలాస్‌గౌడ్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, బంధువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇటుక ట్రాక్టర్ ఢీకొని ఓ గీత కార్మికుడు దుర్మరణం చెందాడు. ఎస్సై గణేశ్, బాధితుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన చేపూరి కైలాస్‌గౌడ్(56) అనే గీత కార్మికుడు ఆదివారం తన ద్విచక్ర వాహనంపై ఈత వనానికి వెళ్తున్నాడు. పోతుగల్ శివారులో ఎదురుగా ఇటుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి కైలాస్‌గౌడ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కైలాస్‌గౌడ్ కుడి కాలు పూర్తిగా విరిగి ఎముక తేలింది. తల, చాతిలో బలమైన గాయాలు కావడంతో తన ద్విచక్ర వాహనంపైనే పడిపోయి ప్రాణాలు వదిలాడు. సిరిసిల్ల సర్ధాపూర్‌కు చెందిన ఇటుక ట్రాక్టర్ లోడుతో ముస్తాబాద్ వైపు వస్తుండగా ఈ సంఘటన జరిగింది. సమాచారమందుకున్న ఎస్సై గణేశ్ పోతుగల్‌కు చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోతుగల్ మాజీ సర్పంచ్ గౌతంరావు, నాయకులు తోట ధర్మేందర్, బాదవేని శ్రీను, కృష్ణ, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మృతదేహాన్ని తరలించేందుకు వారు అంగీకరించలేదు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. ఉదయం సంఘటన జరగగా, మధ్యాహ్నం వరకు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా.. ట్రాక్టర్ యజమాని గ్రామ పెద్దలతో మాట్లాడారు. చివరకు పోస్టుమార్టానికి అంగీకరించడంతో పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కైలాస్‌గౌడ్ భార్య సావిత్రి, కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుల వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న కైలాస్‌కు నలుగురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సాయిరాజ్ ఉపాధి కోసం మహారాష్ట్ర వెళ్లాడు. రెండో కుమారుడు సంతోష్, మూడో కుమారుడు వేణు హైదరాబాద్‌లో, నాలుగో కుమారుడు దినేశ్ దుబాయ్‌లో ఉంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత



మర్లపేటలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

బోయినపల్లి(చొప్పదండి): మర్లపేట గ్రామ శివారులో 21 గ్రాముల మేర గంజాయితో దొరికిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మర్లపేట పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో బోయినపల్లి, సిరిసిల్ల సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో రెక్కీ నిర్వహించారు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన దినేశ్, మహేశ్, ప్రశాంత్ అనే ముగ్గురు యువకులు 21 గ్రాముల గంజాయితో దొరికారు. వారిని విచారిస్తే సిరిసిల్లలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి గంగాధర చుట్టుపక్కల ఫ్యాక్టరీల్లో విక్రయించడానికి వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ బాలయ్య, జేపీ ప్రకాశ్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. ముగ్గురు యువకుల వద్ద నుంచి 21 గ్రాముల మేర గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి శివారులోని సత్తె పీర్లా దర్గా వద్ద అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఒకరిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణానికి చెందిన సయ్యద్ అబ్దుల్ బాసిత్ అనే యువకుడు కొంతకాలంగా చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి తాగుతూ తనకు పరిచయమున్నవారికి గంజాయిని విక్రయిస్తున్నాడు. ఇతర పట్టణాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వారికి ఎక్కువ ధరకు గంజాయిని అమ్ముతూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్నాడు. ఈక్రమంలో కొంతమంది సత్తె పీర్లా దర్గా వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై సుధాకర్‌రావు తన సిబ్బందితో దాడి చేశారు. బాసిత్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 15 రోజుల జ్యూడీ షియల్ రిమాండ్ విధించారు.